సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 27 । జనవరి । 2025



భక్తుల తాకిడి

నరసాపురం రూరల్: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేయించారు.



ఢమరుకం సమర్పణ

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామికి జవ్వాది సరోజిని జ్ఞాపకార్థం కుమారుడు వెంకయ్యనాయుడు మల్టీపర్పస్ ఢమరుకం సమర్పించారు.



ఉప్పాకపాడు విద్యార్థుల ప్రతిభ

ఉంగుటూరు: హేలాపురి బాలోత్సవంలో ఉప్పాకపాడు విద్యార్థులు ప్రదర్శించిన వృద్ధుల నాటిక లఘు నాటిక పోటీల విభాగంలో బహుమతి గెలుచుకుంది.

న్యూస్‌రీల్

ఏకగ్రీవంగా ట్రెజరీ ఎన్నికలు



ఉమ్మడి జిల్లా ఖజానా శాఖ నూతన కార్యవర్గం

ఏలూరు(మెట్రో) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఖజానా శాఖ ఉద్యోగుల సంఘ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. శనివారం ఏలూరు జిల్లా ఖజానా కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించగా ప్రెసిడెంట్‌గా యూవీ పాండురంగారావు, సెక్రటరీగా కప్పల సత్యనారాయణ, ట్రెజరర్‌గా ఎల్.వెంకటేష్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.మధుసూదనరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా పి.హరిబాబు, ఎ.శ్రీనివాసరావు, యు.రాజేష్‌కుమార్, ఎ.రమ కిరణ్మయి, జాయింట్ సెక్రటరీలుగా బి.నరసింహరావు, విద్యాసాగర్, డి.వరలక్ష్మిని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా ఏపీఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా, ఏపీటీఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.రమణారెడ్డి సహాయ ఎన్నికల అధికారిగా, బి.సతీష్ ఎన్నికల అబ్జర్వర్‌గా వ్యవహరించారు. పే అండ్ అకౌంట్స్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ హరినాథ్ తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

'వీరగాథ' పోటీల్లో ప్రథమం



రాష్ట్రస్థాయి బహుమతి అందుకుంటున్న కుసుమ

ఆకివీడు: రిపబ్లిక్ డే సందర్భంగా సర్వశిక్షా అభియాన్ వీరగాథ 4.0 పేరుతో ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సిద్ధాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కలవల కుసుమ (8వ తరగతి) రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఆమె గీసిన 'సెల్యూట్ ఇండియన్ ఆర్మీ' చిత్రం అవార్డు, మెమెంటో, నగదు బహుమతులను సాధించింది. ఆదివారం విజయవాడలో సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ చేతులమీదుగా కుసుమ అవార్డు అందుకుంది. హెచ్ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగదుర్గ, కనిశెట్టి ప్రసాద్, శేషసాయి, కంభంపాటి నర్సింహం, ఎ.ప్రసాద్, మోహన్ ఆమెను అభినందించారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: విజయవాడలో ఈనెల 28 నుంచి అండర్–23 మహిళల, పురుషుల అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళా జట్టును ఆదివారం ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాలలో ఎంపిక చేశామన్నారు. బి.లీలావతి, ఎ. టాలీఅనిత, జి.నాగదేవి, టి.జ్యోతి, పీఎస్ వినయ్‌శ్రీ, వి.యామిని, పి.జయశ్రీ, డి.సాయిభవాని, బి.దేవిశ్రీ, పాలకొల్లుకు చెందిన ఆర్.మహతి, డి.నందిని జట్టు సభ్యులుగా ఎంపికయ్యారన్నారు. స్టాండ్‌బై క్రీడాకారిణులుగా జి.సరిత, జి.సాయిసుధ, ఏపీ చంద్రిక ఉన్నారన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో సినీ నటి ఐశ్వర్య రాజేష్



అమ్మవారి చిత్రపటం అందుకుంటున్న నటి ఐశ్వర్య రాజేష్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని 'సంక్రాంతికి వస్తున్నామ్' సినిమా ఫేమ్ ఐశ్వర్య రాజేష్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, ఫొటో అందజేశారు.





దేశభక్తి గీతాలకు నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



భీమవరం కలెక్టరేట్ వద్ద జెండా వందనం చేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి, ఎమ్మెల్యే అంజిబాబు

సమానత్వ స్ఫూర్తి.. గణతంత్ర దీప్తి



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- కలెక్టరేట్‌లో రిపబ్లిక్ డే వేడుకలు
- జిల్లా అభివృద్ధికి కృషి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రజాస్వామ్యం గణతంత్ర రాజ్యాంగ ఆవిర్భావం ద్వారానే ప్రజలంతా సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం, లౌకికత్వం, న్యాయాలను పూర్తిస్థాయిలో హక్కుగా పొందగలిగారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గణతంత్ర దినోత్సవ తరుణంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించి అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ముందుగా కలెక్టర్ నాగరాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు, సివిల్ మెన్, ట్రాఫిక్ కాంటింజెంట్, ఎస్‌టీఎఫ్ కాంటింజెంట్, విమెన్ కాంటింజెంట్, హోం గార్డ్స్ దళాలు గౌరవ వందనాన్ని సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శనను తిలకించారు. స్వాతంత్ర్య సమరయోధులకు టుంబాలను సత్కరించి ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సంఘ సేవకులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించారు.

జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యాలు చేశారు. విద్యాశాఖ, వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ శకటాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, మత్స్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖ స్టాల్స్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కడగట్ల గురుకుల పాఠశాల విద్యార్థులు స్కాట్లాండ్ బ్యాగ్ పైప్‌బ్యాండ్ కవాతు ప్రదర్శనకు ప్రత్యేక అవార్డును అందుకున్నారు.

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏఎస్పీ వి.భీమారావు, ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.మురళీ కృష్ణంరాజు, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, ఆర్డీఓలు కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దాసి రాజు, డీఎస్పీలు ఆర్‌జీ జయసూర్య, జి.శ్రీవేద, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న దృశ్యం



పోలీసుల కవాతు

వేడుకలకు ఏర్పాట్లపై విమర్శలు

భీమవరం: భీమవరం కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవాలు పేలవంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు మినహా ఏర్పాట్లు అంతంతమాత్రంగా ఉండటంతో వీక్షకులు నిరుత్సాహానికి గురయ్యారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి మినహా మిగిలిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకాలేదు. కలెక్టర్ ప్రసంగం ముగియగానే ఎమ్మెల్యే అంజిబాబు, ఎమ్మెల్సీ గోపిమూర్తి వెళ్లిపోయారు. ప్లాస్టిక్ నిషేధానికి చర్యలని చెప్పిన అధికారులు ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, స్టాల్స్ వద్ద ప్లాస్టిక్ బ్యానర్‌లను నియంత్రించలేకపోయారు. అలాగే మీడియాకు సిట్టింగ్ ఏర్పాట్ల కోసం చిన్నపాటి టెంట్ వేయడం, వేదిక వద్ద పూలకుండీలను తొలగించడం వంటి పనులను విద్యార్థులతో చేయించడం విమర్శలకు తావిచ్చింది. సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించడానికి వచ్చిన విద్యార్థులు మండుటెండలోనే కూర్చోవాల్సి వచ్చింది. ప్రభుత్వ పథకాల శకటాలు అంతగా ఆకట్టుకోలేదు. ఎండ తీవ్రతతో తాగునీటి కోసం ఇబ్బంది పడాల్సి వచ్చింది.



ఎండలో కూర్చున్న విద్యార్థులు



విద్యార్థులతో పూలకుండీలు మోయిస్తున్న దృశ్యం



వ్యవసాయ శాఖ శకటం



చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన



విద్యాశాఖ శకటం

భీమవరంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సందడి



వేదికపై మాట్లాడుతున్న వెంకటేష్. చిత్రంలో హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి, దర్శకుడు అనిల్ రావిపూడి, బాల నటుడు రేవంత్ (బులిరాజు)

భీమవరం: భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం రాత్రి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర బృందం సందడి చేసింది. సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ సంబరాల పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రం హీరో, హీరోయిన్లు వెంకటేష్, ఐశ్వర్యరాజేష్, మీనాక్షి డ్యాన్స్‌లతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ముందుగా గాయకులు శ్రీకృష్ణ, రఘురామ్, మధుప్రియ, రోహిణి తదితరులు చిత్రంలోని పాటలు ఆలపించారు. అలాగే కళాశాల విద్యార్థులు డ్యాన్స్‌లతో ఆకట్టుకున్నారు. చిత్రంలో బులిరాజు పాత్రతో ఆకట్టుకున్న రేవంత్ తన మాటలతో ప్రేక్షకులను నవ్వించగా పాటల రచయితలు భాస్కర్‌భట్ల, చేగొండి అనంతశ్రీరామ్, సంగీత దర్శకుడు భీమ్స్ సినిమాలో పాటలు, డైలాగులతో అలరించారు. అనంతరం హీరో వెంకటేష్ మాట్లాడుతూ సంక్రాంతికి వస్తున్నాం సినిమా చిత్రీకరణ సమయంలో తప్పక హిట్ కొడతామని భావించామని, ప్రేక్షకులు త్రిపుల్ బ్లాక్ బస్టర్ ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. సినిమా విజయం వెనుక దర్శకుడు అనిల్ రావిపూడి శ్రమ చెప్పలేనిదన్నారు. వచ్చే సంక్రాంతికి మరో బ్లాక్‌బస్టర్‌తో మీ ముందుకు వస్తామన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత హిట్ కొట్టే సినిమా కోసం ఆలోచిస్తున్నానని, రెబల్‌స్టార్ ప్రభాస్‌తో సినిమా తీయడానికి ఎదురు చూస్తున్నట్టు చెప్పారు. హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి మాట్లాడుతూ సినిమాను ఇంత పెద్ద హిట్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో నిర్వహించిన ఈ ఈవెంట్ తన కళాశాల రోజులను గుర్తుకు తెచ్చిందని మీనాక్షి అన్నారు. చిత్ర నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, హాస్యనటుడు శ్రీనివాసరెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), కామినేని శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సమయస్ఫూర్తి



ఆత్మహత్యకు యత్నించిన చెన్నయ్య (నీలం చొక్కా)తో పోలీసులు

భీమవరం: కుటుంబ కలహాలతో యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకడానికి ప్రయత్నించిన వ్యక్తిని టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ సమయస్ఫూర్తితో రక్షించారు. పట్టణంలోని బ్యాంక్ కాలనీకి చెందిన రిక్షా కార్మికుడు సిధిని చెన్నయ్య ఆదివారం కుటుంబసభ్యులతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఆత్మహత్య చేసుకునేందుకు ప్రభుత్వాసుపత్రి వద్ద యనమదుర్రు డ్రెయిన్‌పై ఉన్న కాలిబాట వంతెనపై నుంచి దూకే ప్రయత్నం చేశారు. అదే సమయంలో మోటార్‌సైకిల్‌పై అటుగా వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ ఆయన్ను గమనించి అడ్డుకున్నారు. అనంతరం చెన్నయ్యను స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలి

ఏలూరు (టూటౌన్): రాబోయే తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఉద్యోగులు పనిచేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయడంలో న్యాయవాదులు విశేష కృషి చేయాలని, తద్వారా సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందని సూచించారు. ప్రతి వ్యక్తి సొంత లాభాన్ని కొంత త్యాగం చేసి సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఎస్.ఉమా సునంద, డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఏపీపీ కోనే సీతారామారావు, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి



బాలుడు విక్కీ మృతదేహం

కైకలూరు: మండవల్లి మండలం భైరవపట్నంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మూడేళ్ల బాలుడు ఆదివారం ప్రాణాలు విడిచాడు. ఈనెల 24న రాత్రి భైరవపట్నంలో గ్యాస్ సిలిండర్లు పేలి తొమ్మిది గుడిసెలు దగ్ధమైన విషయం తెలిసిందే. ప్రమాదానికి కారణమైన గుడిసెలోని దుబ్బా వంశీ (25), అతని భార్య అన్ను (21), వారి కుమారుడు విక్కీ (3)తో పాటు మరో ముగ్గురు కుటుంబసభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బాలుడు విక్కీ మరణించాడు. వంశీ, అన్ను పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. వంశీ మృతదేహాన్ని నందివాడ మండలం పోలుకొండలోని తాతయ్య ఇంటికి తరలించారు. క్షతగాత్రుల్లో నక్కల షారుఖాన్ (45), అతని కుమారులు చరణ్ (19), కార్తీక్ (18)లను కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం తమిళనాడులోని వెల్లూరుకు ఆదివారం రాత్రి తరలించారు.

క్లుప్తంగా

నేటినుంచి బైబిల్ మిషన్ సభలు



నాచుగుంట వద్ద బైబిల్ మిషన్ మహాసభల కోసం ఏర్పాట్లు

ఉంగుటూరు: మండలంలోని నాచుగుంట వద్ద బైబిల్ మిషన్ మహా సభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు ఈ సభలు నిర్వహిస్తున్నారు. సభలకు వచ్చే వారికి తాగునీరు, భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. కోస్తా జిల్లాలతో పాటు రాష్ట్రం లోని పలు ప్రాంతాల నుంచి విశ్వాసులు, పాస్టర్లు పెద్దసంఖ్యలో రానున్నారు.

రాజ్‌భవన్ తేనీటి విందుకు జెస్సీ



బాల పురస్కార్ అవార్డు గ్రహీత జెస్సీని అభినందిస్తున్న గవర్నర్ జస్టిస్ మహ్మద్ నజీర్

దెందులూరు: ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డు గ్రహీత జెస్సీకి ఆదివారం రాజ్‌భవన్‌లో అరుదైన గౌరవం, గుర్తింపు లభించింది. గవర్నర్ మహ్మద్ నజీర్ ఆహ్వానం మేరకు ఆదివారం రాజ్‌భవన్‌కు చేరుకున్న జెస్సీ, తండ్రి సురేష్, కుటుంబ సభ్యులకు గవర్నర్ స్వాగతం పలికారు. జెస్సీకి తేనీటి విందు ఇచ్చారు. స్కేటింగ్‌లో సాధించిన విజయం, శిక్షణపై అడిగి తెలుసుకున్నారు.

ఆహ్లాదం.. ఆటపాక పక్షుల తీరం



పక్షుల కేంద్రంలో పర్యాటకుల బోటు షికారు

కైకలూరు: ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. బోటు షికారు చేస్తూ పెలికాన్ పక్షులను దగ్గర నుంచి వీక్షించారు. సమీపంలో చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడుకున్నారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రంజిత్‌కుమార్ కొల్లేరు పక్షుల విశేషాలను అందరికీ వివరించారు.

అఖిల గాండ్ల తెలికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): అఖిల గాండ్ల తెలికుల కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి గురుమూర్తి కోరారు. స్థానిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గురుమూర్తి ఇంటి వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాపోలు వెంకట శ్రీనివాస్, కోశాధికారి చెన్నం వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పాడ ఆనంద్ కుమార్, ఏలూరు టౌన్ అధ్యక్షులు అరిసెల విజయ సాయిబాబు పాల్గొన్నారు.

సేవకు పురస్కారం

భీమవరం కలెక్టరేట్ వద్ద ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా అవార్డులు అందజేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. – భీమవరం (ప్రకాశం చౌక్)



కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న నరసాపురం సబ్ కలెక్టర్ దాసి రాజు



వి.భీమారావు, అడిషనల్ ఎస్పీ
టి.శివరామప్రసాద్, డీఎం సివిల్ సప్లయిస్
డాక్టర్ కె.మురళీకృష్ణ, డీఏహెచ్
జెడ్.వెంకటేశ్వరరావు, జేడీ, వ్యవసాయశాఖ
ఎన్.సరోజ, సివిల్ సప్లయిస్
ఎం.నాగరాజు, జాయింట్ రిజిస్ట్రార్
బి.అరుణశ్రీ, డీపీఓ
టి.నాగేశ్వరరావు, డీపీఆర్ఓ
ఎం.వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ
డాక్టర్ సీహెచ్ అప్పారావు, డ్వామా పీడీ
బి.నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ
టి.ఉమామహేశ్వరరావు, ట్రాన్స్‌పోర్ట్ డీసీ
ఎ.గణేష్, డీడీ ట్రెజరీ
వి.సుజాతారాణి, ఐసీడీఎస్, పీడీ



ఎల్.వెంకటేశ్వర్లు, డీఆర్
టి.రవికుమార్, మునిసిపల్ కమిషనర్, తణుకు
కె.రామచంద్రారెడ్డి మునిసిపల్ కమిషనర్, భీమవరం
ఎంవీ సత్యనారాయణ, డీఎస్పీ
డి.విశ్వనాథ్, డీఎస్పీ
డాక్టర్ జి.శ్రీవేద, డీఎస్పీ
బి.శ్రీనివాసరావు, సీఐ
వి.జగదీశ్వరరావు, సీఐ
బి.యాదగిరి, సీఐ
ఎ.సుబ్రహ్మణ్యం, సీఐ
ఎండీ అహ్మదున్నీషా, సీఐ
వి.పుల్లారావు, సీఐ
డి.వెంకటేశ్వరరావు, సీఐ
ఎస్.సత్యసాయిబాబా, ఎస్సై
ఎస్‌వీవీ సత్యనారాయణ, ఏఎంవీఐ
సీహెచ్ శ్రీనివాస్ ఏడీఏ
భూపతిరాజు రవీంద్రరాజు
ఆనంద విశ్వనాథరాజు
శ్రీరామరాజు
వి.సుబ్బన్నరెడ్డి, డీఎం ఆర్టీసీ
వై.సురేష్ సీఐ ఆర్టీసీ
ఏవీ వెంకటేశ్వరరావు, ఏఈ
బి.మోహనకృష్ణ, ఏఈ
జి.దుర్గ పవన్‌కుమార్, ఏఈ
వి.రమణారావు, ఏఈ
డి.సుప్రజ, మెడికల్ ఆఫీసర్
చెరుకువాడ రంగసాయి
అల్లు శ్రీనివాస్
అప్పారావు, ఎంపీడీఓ
ఎం.రవిశంకర్, సివిల్ సప్లయిస్
కె.మురళీకృష్ణ
పళ్ల ఏసుబాబు
కెంతేటి వెంకట్రాజు
వై.కిరణ్‌కుమార్, ఎస్సై
ఎఫ్.రెహమాన్, ఎస్సై
టి.మురళీకృష్ణ, ఏపీఓ
ఎం.బాలాజి, డీపీఎం
వెంకటరమణ, ఎస్సై
ఎస్.దొరబాబు, ఎక్సైజ్ ఎస్సై
వి.సత్యనారాయణమూర్తి
డి.రాజు, 108 సిబ్బంది
పి.జాన్, 108 సిబ్బంది
జి.రాంబాబు, తహసీల్దార్, భీమవరం
జి.వాసు, ఎస్సై

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐలు యాదగిరి, దుర్గాప్రసాద్

నరసాపురం రూరల్: ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నరసాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పట్టణ, రూరల్ సీఐలు యాదగిరి, దుర్గా ప్రసాద్ ఆదివారం వివరాలు వెల్లడించారు. నరసాపురం పట్టణ, మొగల్తూరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న కొండపల్లి అరుణకుమార్, మట్టపర్తి రాజకుమార్‌లను అరెస్టు చేసి, వారినుంచి 50 గ్రా. బంగారం, 150 గ్రా. వెండి, ఒక ల్యాప్‌టాప్, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై మొగల్తూరు, కాకినాడ, నిడమర్రు పోలీస్ స్టేషన్‌లతో పాటు తూర్పు, కృష్ణ, ఏలూరు జిల్లాల్లో 10కి పైగా కేసులు ఉన్నాయన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఈ సమావేశంలో పట్టణ, మొగల్తూరు ఎస్సైలు జయలక్ష్మి, వాసు, సిబ్బంది ఉన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ఉండి: భర్త అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతుండడంపై ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి బాలజీరావు పేటకు చెందిన గంధం సుధారాణికి తాడేపల్లిగూడెంకు చెందిన సతీష్‌తో 2015లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.5 లక్షలు వరకట్నంగా అందజేశారు. అయితే చెడు వ్యసనాలకు అలవాటు పడిన సతీష్ వివాహమైన నాటి నుంచి మరో రూ.5 లక్షలు అదనపు కట్నంగా తీసుకురావాలని సుధారాణిని మానసికంగా, శారీరకంగా వేధించడం, ఇందుకు అత్త, మామ, బావ సహకరించడంతో ఆమె భరించలేక తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో జెడ్పీటీసీకి గాయాలు

ద్వారకాతిరుమల: స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్ ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వెంకటరామన్నగూడెంలో జరుగుతున్న ఒక విందు కార్యక్రమానికి హాజరయ్యేందుకు శామ్యూల్ తన ఇద్దరి స్నేహితులతో కలసి కారులో వెళుతున్నారు. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం దాటిన తరువాత రోడ్డు డివైడర్‌కు రంగులు వేసే క్రమంలో డైవర్షన్ ఇచ్చారు. దాంతో వాహనాల రాకపోకలు ఒకే మార్గం గుండా సాగుతున్నాయి. వెంకటరామన్నగూడెం యూనియన్ బ్యాంకు వద్దకు వచ్చేసరికి, తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల వైపునకు వెళ్లే ఒక మినీ వ్యాన్ కారు ముందు భాగాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

చెరువులో పడి విద్యార్థి మృతి



గుజ్జుల శివకుమార్

దెందులూరు: మండలంలోని సీతంపేటలో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. సీతంపేట గ్రామానికి చెందిన గుజ్జుల శివకుమార్ కుమారుడు గణేష్ (10) ప్రమాదవశాత్తు నాగులచెరువులో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ , సిబ్బంది గ్రామస్తుల సహకారంతో నాగులచెరువులో గాలింపు చర్యలు చేపట్టారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మంగమ్మ తల్లిని దర్శించుకుని ధూప, దీప నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో భక్తులు తరలివచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పాటమ్మ తల్లిని, పసుపులమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

'ఆర్య' పథకంతో ఉపాధికి ఊతం



గిరిజన మహిళలకు మేకలను పంపిణీ చేస్తున్న దృశ్యం



ఆర్య పథకంలో అందించిన కోళ్లతో మహిళ

తాడేపల్లిగూడెం: వ్యవసాయం వైపు యువతను ఆకర్షించడంతో పాటు వ్యవసాయాన్ని వ్యాపార దృక్పథంగా మార్చేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అట్రాక్టింగ్ అండ్ రిటైనింగ్ యూత్ ఇన్ అగ్రికల్చరల్ (ఆర్య) పథకం మహిళలకు, యువతకు ఉపాధి మార్గాలను అందిస్తుంది. యువతను వ్యవసాయం వైపు ఆకర్షించడంతో పాటు, నిలకడగా వ్యవసాయంలో కొనసాగుతూ, నైపుణ్యపరంగా అభివృద్ధి సాధించేలా చేయడం ఉద్దేశాలను ఈ పథకాన్ని రూపొందించారు. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా పశ్చిమ ఉమ్మడి జిల్లాలో సత్ఫలితాలను ఇవ్వడంతో పాటుగా , మహిళలకు, యువతకు ఉపాధిని పెంచుతుంది. వెంకట్రామన్నగూడెం కేవీకే ద్వారా నైపుణ్య, అభివృద్ధి శిక్షణలు కొంత కాలంగా కొనసాగుతున్నాయి.

నాలుగు విభాగాలుగా శిక్షణ

ఆర్య పథకం ద్వారా నాలుగు విభాగాలుగా శిక్షణను ఇస్తున్నారు. పూలు, పండ్లు కూరగాయలతో విలువ

అల్పాదాయ వర్గాలకు మేలు చేస్తున్న పథకం

ఆధారిత ఉత్పత్తుల తయారీ, తేనెటీగలు, పెరటి కోళ్ల పెంపకం, సమీకృత వ్యవసాయంలో శిక్షణ, పూలను పునర్వియోగించి ఫొటోలు, క్యాలెండర్‌లు, పూల గుచ్చాలు, కీచైన్లు, అలంకరణ వస్తువులు, అగరబత్తీలు తయారు చేయడం వంటి కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ విభాగాలుగా ఇంత వరకు ఇచ్చిన శిక్షణలు తద్వారా ఏర్పాటు చేసుకున్న ఉపాధి మార్గాలతో యువత, మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధిస్తున్నారు. చిరు ధాన్యాలతో వివిధ రకాల తినుబండారాలను తయారు చేస్తున్నారు. కూరగాయలతో క్వాషెస్, గోవా, నెట్టర్ , నన్నారి, మిక్సడ్ ఫ్రూట్ జామ్, బనానా బిస్కెట్స్, క్యాష్యూ ఆపిల్ సిరప్, ,మల్టీ గ్రెయిన్ పౌడర్‌ను మహిళలు తయారు చేస్తున్నారు. నెలకు పదివేల రూపాయల వరకు అదనపు ఆదాయం పొందుతున్నారు. 15 మంది మహిళలు గ్రూపుగా ఏర్పడి కృషి ఉద్యాన మహిళా గ్రూపుగా ఏర్పడి వెంకట్రామన్నగూడెం కేవీకే ద్వారా వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద విక్రయ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. తేనెటీగల పెంపకానికి సంబంధించి ఐదు సంఘాలను ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేశారు. తేనె, గిరిధార తేనె, హెరిటేజ్ ఏపీ కల్చరిస్టు, మధుశ్రీ తేనె, ఆర్గానిక్ చేతన్ తేనె, వంటివి తయారు చేసి విక్రయిస్తూ యువత నెలకు రూ.20 వేల చొప్పున ఆదాయం ఆర్జిస్తున్నారు. శాస్త్రీయ పద్ధతిలో పెరటికోళ్ల పెంపకం ద్వారా మహిళలకు శిక్షణను ఇచ్చి ఒక్కొక్కరికి 40 రోజుల వయస్సు కలిగిన 50 కోళ్లను, వాటి పెంపకానికి అవసరమైన కేజెస్, మందులు, ఇంక్యుబేటర్ ఇస్తున్నారు. ఈ పెంపకం ద్వారా నెలకు 30 వేల నుంచి 80 వేల రూపాయల వరకు ఆదాయం పొందుతున్నారు. సమీకృత వ్యవసాయ విధానంలో గిరిజన రైతులకు చెరువులు కేటాయించి వారికి నెలకు 25 వేల రూపాయల ఆదాయం పొందే మార్గాలను చూపిస్తున్నారు. మహిళలు, యువత ఆర్థిక స్వయం సమృద్ధి సాధించడానికి ఆర్య పథకం బహుముఖంగా ఉపయోగపడుతుందని కేవీకే వెంకట్రామన్నగూడెం సమన్వయకర్త డాక్టర్ విజయ లక్ష్మి చెబుతున్నారు.

జాతీయస్థాయి గోకార్ట్ చాంపియన్‌షిప్ విజేత విశాఖపట్నం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రపంచ పారిశ్రామిక విప్లవానికి మెకానికల్ ఇంజనీరింగ్ చాలా అవసరమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి గోకార్ట్ చాంపియన్‌షిప్ పోటీలు ముగింపు సందర్భంగా ఆదివారం విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సొంతంగా డిజైన్ చేసి సాహసోపేతంగా వాహనాన్ని నడిపి విజయాలు సాధించటం సాంకేతిక ప్రగతికి, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ఆత్మవిశ్వాసానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ ప్రథమ, ద్వితీయ స్థానాలు విశాఖపట్నం రఘు ఇంజనీరింగ్ కళాశాల సాధించగా, తృతీయ స్థానం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎక్సెలరేషన్, స్కిప్యాడ్‌లో ప్రథమ, ద్వితీయ, టైం టోటల్‌లో కూడా విశాఖపట్నం రఘు ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ ద్వితీయ స్థానాలు సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత వర్మ, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ కె సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాదిగ ఉత్సవ్



సభలో మాట్లాడుతున్న మనోజ్ గోర్థెలా

ముసునూరు: మాదిగ జాతిలో ప్రతి కుటుంబం నుంచి జాతిని ఉద్ధరించే న్యాయవాది ఉద్భవించాలని సుప్రీంకోర్టు న్యాయవాది, ఉత్తరాఖండ్ మాజీ డిప్యూటీ అడ్వకేట్ జనరల్ డాక్టర్ మనోజ్ గోర్థెలా అన్నారు. కాట్రేనిపాడు-చిల్లబోయినపల్లి సరిహద్దులోని మాదిగ కొండ ప్రాంగణంలో మండల నేతలు కంబాల రాంబాబు, గద్దల మోహనరావు ఆధ్వర్యంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు గురిందపల్లి చిట్టిమాదిగ అధ్యక్షతన మాదిగ ఉత్సవ్-2025 కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ ప్రముఖులు, న్యాయవాదులు, వైద్యులు, ఉద్యోగులు తదితరులను సత్కరించారు.

క్లుప్తంగా

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



పట్టణంలో బైక్ ర్యాలీ, నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రజా సంఘాలు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కార్మిక సంఘాల కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పట్టణంలో ఆదివారం మోటారు సైకిల్ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు సిరపరపు రంగారావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ నాయకత్వం వహించారు. వక్తలు మాట్లాడుతూ రిపబ్లిక్ డే రోజున భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన మోదీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పని చేస్తున్నాడని విమర్శించారు. జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషు, పెనుగంటి దుర్గా, పోతు శ్రీను, గొర్రెల సతీష్, దుర్గారావు, నాగేంద్రబాబు, రాము, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారి విగ్రహం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సత్యవతినగర్ 11వ వార్డులోని ఏరియా ఆసుపత్రి వద్ద వేంచేసియున్న కనకమహాలక్ష్మి అమ్మవారి నూతన ఆలయంలో యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల 27వ తేదీ సోమవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం వరకు నిర్వహిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల గోపీకృష్ణ, కార్యదర్శి యాదల శివాజీనాయుడు, కోశాధికారి బొర్రా మురళీధర్ వెల్లడించారు.

నడిరోడ్డుపై ప్రచారం.. నిలిచిన వాహనాలు



నందిబొమ్మ సెంటర్‌లో ట్రాఫిక్ జాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేవలం రూ.70కే ఐఫోన్ అంటూ పట్టణంలోని కేఎన్‌రోడ్డు నందిబొమ్మ సెంటర్‌లో మైక్ ప్రచారం నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతంలోకి భారీగా జనం తరలి వచ్చారు. రహదారి మార్గంలో వాహనాలు నిలిపివేశారు. ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. ట్రాఫిక్ నిలిచిపోవడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు పలు ఇక్కట్లు పడ్డారు. ఇటువంటి ప్రచారాలు కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం సరికాదని, ఇటువంటి సంఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడి



నిందితురాలితో ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేయగా ఆదివారం ముద్దాయిను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి వెల్లడించారు. స్టేషన్ పరిధిలో వేరు వేరు ప్రదేశాల్లో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఎక్సైజ్ ఎస్సై మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది ఆధ్వర్యంలో యాగర్లపల్లిలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 15 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

గౌడ కులాన్ని చీలుస్తారా?

ఉండి: ఎన్నికల సమయంలో గౌడ కులానికి ఇస్తానన్నా 20 శాతం మద్యం దుకాణాలను ఇవ్వాలని అడిగితే లేని కులాలను చూపిస్తూ గౌడ కులాన్ని చంద్రబాబు చీలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ పత్రికా ప్రకటనలో ఆదివారం ఖండించారు. రాష్ట్రంలో గౌడ కులంలో నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు 10 కులాలుగా చూపిస్తూ 20 శాతం మద్యం దుకాణాలు ఇస్తానని వాగ్దానం చేసిన చంద్రబాబు ఇప్పుడు 10 శాతం మాత్రమే ఇస్తూ 40 లక్షల గౌడ జనాభాను మోసగిస్తున్నారన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పదనం

గణతంత్ర వేడుకల్లో వక్తలు

తాడేపల్లిగూడెం: భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పతనమని, స్వాతంత్ర్య ఫలాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి కోరారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం ఏపీ నిట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్స్ పడాల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు 36 వేల రూపాయల విలువైన నిత్యావసర వస్తువులను అందచేశారు. ప్రతిభ చూపిన సిబ్బందికి, విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. డీన్‌లు డాక్టర్ వి.సందీప్, కె.హిమబిందు, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళదాం

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళదామని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం వర్సిటీలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. రైతు ప్రయోజనాల కోసం పని చేస్తున్న శాస్త్రవేత్తలకు, వ్యవసాయ, ఉద్యాన విశ్వ విద్యాలయ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మాండ్లేజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో 18 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్ కింద రూ.13 లక్షల చెక్కులను అందించారు. ఏఎస్‌ఆర్‌బీ ద్వారా జాతీయ స్థాయిలో నియామకాలు పొందిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు వర్సిటీ అధికారులు పాల్గొన్నారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో రిపబ్లిక్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ మహమ్మద్ ఇస్మాయిల్, ఎన్‌సీసీ అధికారి పి.ఎస్.శేఖర్‌లు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్వేచ్ఛను కాపాడాలి

తాడేపల్లిగూడెం రూరల్: రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా కాపాడాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల వద్ద నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో జాతీయ పతాకాలను ఎగురవేశారు. తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఎంఈవో వి.హనుమ, నాయకులు వర్తనపల్లి కాశి, అడబాల నారాయణమూర్తి, పైబోయిన వెంకట్రామయ్య, మైలవరపు రాజేంద్రప్రసాద్, మద్దాల మణికుమార్, చాపల రమేష్, గట్టిం నాని, అడబాల మురళీ, బైనపాలెపు ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ): వేడుకల్లో పాల్గొన్న ఆర్డీవో, తహసీల్దార్



తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తణుకు అర్బన్: జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్



పెంటపాడు: టీబీఆర్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిపబ్లిక్ డే వేడుకలు



ఇరగవరం: గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కడియద్ద సచివాలయంలో

మండలంలోని సచివాలయాల వద్ద ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కడియద్ద, చినతాడేపల్లి, నీలాద్రిపురం, పెదతాడేపల్లి, అప్పారావుపేట, వీరంపాలెం, బంగారుగూడెం, పట్టింపాలెం తదితర గ్రామాల్లోని సచివాలయాల వద్ద ఆయా పంచాయతీ కార్యదర్శులు జాతీయ పతాకాలను ఎగురవేశారు. అలాగే మాధవరం మాజీ సైనికుల సంక్షేమ సంఘ కార్యాలయం వద్ద మాజీ సైనికులు గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు

తణుకు అర్బన్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదివారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి జెండా ఆవిష్కరించారు. న్యాయమూర్తులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు. తణుకు మునిసిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ టి.రామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ జెండా ఆవిష్కరించారు.

76వ గణతంత్ర దినోత్సవం

అత్తిలి: మండలంలో 76వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.శామ్యూల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దళిక వంశీ జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పి.ప్రేమరాజు, అత్తిలి సచివాలయం వద్ద సెక్రటరీ భాస్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని రాధ జాతీయ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, ఆనాల ఆదినారాయణరావు, బాలం మహేష్, దాసం ప్రసాద్, పూతినీడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ సాయిలలో అధికారులు జెండా వందనం చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం దేశనాయకులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కాళీ కృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది హాజరైయారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. మాజీ సైనికులు ఎం.విశ్వనాథన్, కేవీ సుబ్బారావులను సత్కరించారు. కమిషనర్ ఎం.ఏసుబాబు, అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌చార్జి రవి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఏడీజే కోర్టు జడ్జి షేక్ సికిందర్ బాషా ఆవిష్కరించారు. జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దూలం వెంకట విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో క్లబ్ జోన్ చైర్ పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భవిత కేంద్ర ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, పట్టణ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ రెడ్డి, కర్రి ప్రభాకర్ బాలాజీ, కోట రాంబాబు, నరిశే సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. పెద్ద మసీద్ ఆధ్వర్యంలో జాతీయ గీతాలు ఆలపన చేశారు. వాకర్స్ భవనంలో అధ్యక్షుడు తిరుమళ్ల సూరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు.

పెంటపాడులో

పెంటపాడు: మండలంలో పలు గ్రామాలలో గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో బాలాజీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిఫెన్స్ అకాడమీ, టీబీఆర్ సంస్థల ఉద్యోగుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో, పెంటపాడు బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, దర్శిపర్రు గ్రామంలో సర్పంచ్ కోలా శేషవేణి తదతరుల ఆధ్వర్యంలో రిపబ్లిక్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో..

ఇరగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవవేడుకలు ఎంపీడీవో ఎ.శ్రీనివాసు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండలపరిషత్తు అధ్యక్షురాలు కె.అలివేలు మంగతయారు, నియోజకవర్గ సభ్యులు, సర్పంచులు, కూటమి నాయకులు, అధికారులు సిబ్బంది హాజరైయారు.



తాడేపల్లిగూడెం: ఉద్యానవర్సిటీ గణతంత్ర వేడుకల్లో వీసీ కె.గోపాల్



అత్తిలి: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో పి శామ్యూల్



తాడేపల్లిగూడెం: శశిలో నిర్వహించిన గణతంత్ర వేడుకలు

హోటళ్లు నాణ్యతను పాటించాలి

తాడేపల్లిగూడెం: వినియోగదారులకు నాణ్యతతో కూడిన మంచి ఆహార పదార్థాలను అందించాలని పట్టణ హోటల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పైబోయిన రఘు సూచించారు. అసోసియేషన్ సమావేశం ఆదివారం పట్టణంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. రఘు మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ఆహార పదార్థాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్రభుత్వ అధికారుల తనిఖీలు పెరిగాయన్నారు. అనుకూలమైన ధరను నిర్ణయించుకొని మంచి ఆహార పదార్థాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలన్నారు. మార్కెట్‌లో పోటీ పెరిగింది కదా అని, గిట్టుబాటు కాకుండా తక్కువ ధరలకు పదార్థాలను విక్రయించుకొని నష్టపోవద్దన్నారు. ఈ మధ్యకాలంలో మసీదు రోడ్‌లో ఒక హోటల్ యజమాని ఆర్థిక ఇబ్బందుల వల్ల అదే హోటల్లో ఆత్మహత్య చేసుకున్న సంఘటనను మరవద్దన్నారు. పోటీతత్వం ఉండాలి కాని, మన వ్యాపారాలు దెబ్బతినే విధంగా వ్యాపారాలు చేయొద్దన్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకం మానేయాలన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్, ఫుడ్ సేఫ్టీ అధికారులతో ఒక కమిటీగా ఏర్పడి తనిఖీలు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారని, ఉన్నతాధికారుల తనిఖీల్లో ఏదైనా హోటల్‌ను సీజ్ చేస్తే తిరిగి ఓపెన్ చేయించే పరిస్థితి ఉండదన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేగి శ్రీనివాసు, ఆకుల నాగు, రాము స్వీట్స్ అధినేత, తదితరులు పాల్గొన్నారు.



హోటల్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు పైబోయిన రఘు

బాలోత్సవం విజేతలకు బహుమతులు

తణుకు అర్బన్: శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవం పేరిట పిల్లల సంబరాలు ఆద్యంతం అలరించాయని బాలోత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు, నిసా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ హుస్సేన్ అహ్మద్ అన్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించిన బాలోత్సవాల్లో భాగంగా ఆదివారం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ బాలలకు నిర్వహించిన ఈ ఉత్సవం ఎంతో అభినందనీయమని 2500 మందికిపైగా విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సంబరాలు నిర్వహించడం చాలా కష్టతరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 45 రకాల ఎకడమిక్, కల్చరల్ ఈవెంట్స్‌లో తమ ప్రతిభను చాటిన విద్యార్థుల్లో 300 మందికి సర్టిఫికెట్లు, మెమెంటోలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ నరసింహారావు, పి.దక్షిణామూర్తి, సభ్యులతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల అసోసియేషన్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

తణుకు అర్బన్: మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయకపోతే స్వాతంత్రయోద్యమ స్ఫూర్తితో పోరాటం సాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ హెచ్చరించారు. తణుకు బ్యాంకు కాలనీలో ఆదివారం సీఐటీయూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి నేటి వరకు కార్పొరేట్ సంస్థల కోసమే పని చేశారని, ఓట్లేసిన దేశ ప్రజల పైన భారాలు వేస్తూ పెట్టుబడి దారులకు పన్నులు తగ్గించడం వంటి అక్రమాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, గారా రంగారావు, ఎం.రమేష్, ఐసీహెచ్ రామకృష్ణ, హర్ష, నరేష్, శర్మ, మోహన్‌రావు, శివకుమార్, మహేష్, నారాయణ, గణేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

భీమవరం: రానున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక ప్రజా సంఘాలు బలపరిచిన ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థిగా దిడ్ల వీరరాఘవులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి పిలుపునిచ్చారు. పీడీఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులను ప్రకటించిన నేపథ్యంలో ఈరోజు సాయంత్రం భీమవరం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీ రాఘవులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యాపక విద్యార్థి యువజన మహిళ ప్రజా సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని భవిష్యత్తులో వారి సమస్యలపై పోరాడతానన్నారు.

గ్యాస్ ప్రమాదాలను నివారించాలి

ఆకివీడు: మన వంట గది భద్రత మన చేతుల్లోనే ఉందని నగర పంచాయతీ కో–ఆప్షన్ సభ్యులు మన్నే లలితాదేవి చెప్పారు. స్థానిక జెఎస్‌టీ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మన వంట గది–మన బాధ్యత ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్యాస్ వినియోగంలో మహిళలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్యాస్ ఆన్ చేసినప్పుడు, ఆఫ్ చేసినప్పుడు తీసుకునే జాగ్రత్తలు చాలా ముఖ్యమన్నారు. సిలిండర్‌తో పాటు ట్యూబ్ కూడా కంపెనీదే ఉపయోగించాలన్నారు. పొయ్యిని సిలిండర్ కంటే ఎత్తులో ఉంచాలని సూచించారు. గ్యాస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వల్లీ శివ రామలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి మహిళా తన ప్రథమ కర్తవ్యం ఇంటి భద్రతేనన్నారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి విడుదలైన నిధుల వినియోగంపై ఎస్‌ఆర్‌ఆర్‌ఈజీఎస్ నుంచి గోవిందరావు నేతృత్వంలోని చెన్నయ్య, నాగరాజుల బృందం లైబ్రరీ, మధ్యాహ్న భోజన పథకం తీరు, సైన్స్ ల్యాబ్, క్రీడా పరికరాలను తనిఖీ చేశారు. పాఠశాలకు మంజూరైన కొంత నిధులపై ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సత్యవాణి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

జగ్జీవన్, అంబేడ్కర్ సేవలు మరువలేనివి

పెంటపాడు: దళిత జాతి అభ్యున్నతి కోసం అంబేడ్కర్, జగ్జీవన్ సేవలు మరువలేనివని వైస్ ఎంపీపీ ముప్పిడి సరోజిని పేర్కొన్నారు. కోరిమిల్లి గ్రామానికి చెందిన దాత ముప్పిడి వీర్రాజు రూ.లక్ష సొంత నిధులతో గ్రామంలోని అంబేడ్కర్, జగ్జీవన్ విగ్రహాల రక్షణ కోసం నూతనంగా శ్లాబ్ వేయించి, రంగులు వేయించారు. కాగా ఈ కార్యక్రమాన్ని రిపబ్లిక్ డే పురస్కరించుకొని ఎంపీపీతో పాటు, దాత తల్లిదండ్రులైన చిన్నమారియ్య, చిట్టెమ్మ దంపతులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత వీర్రాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గారపాటి భాస్కరరావు, ముప్పిడి సుబ్బారావు, సంఘ అధ్యక్షుడు కంకిపాటి శ్రీను, మాజీ సర్పంచ్ చిలకా వెంకట్రావు, యువసేన కార్యదర్శి ముప్పిడి శ్రీను, మార్లపూడి రవి, పెనుమాక రామస్వామి, తుంపిడి మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



శ్లాబ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సంయుక్త కిసాన్ మోర్చా ఆందోళన

భీమవరం: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ రంగాన్ని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టమని, ప్రజలపై భారాలు మోపమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.బలరాం డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు వంతెన వద్ద రైస్‌మిల్ సెంటర్ నుంచి ప్రకాశం చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిత్యావసర వస్తువుపై విపరీతమైన భారం మోపి కార్పొరేట్లకు లాభాలు చేకూరుస్తున్నారని విమర్శించారు. రైతులు పోరాటంతో నల్ల చట్టాలు రద్దు చేస్తానన్న నరేంద్రమోదీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు మాట్లాడుతూ రానున్న బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు పెంచాలని, కార్మిక హక్కులు హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇచ్చే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్‌మోర్చ జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్, కలిదిండి గోపాలరాజు, శేషపు ఆశ్రియ్య, ఇంజేటి శ్రీనివాసరావు, డి.త్రిమూర్తులు, బంగారు వరలక్ష్మి, బి.గణేష్, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న బలరాం

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ బంటుమిల్లి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బంటుమిల్లి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరంలో శ్రీవిష్ణు కళాశాల వద్ద ఆదివారం రోడ్డు భద్రతా వారోత్సవాలోల్ల భాగంగా హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ బంటుమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ భారం కాకూడదని బాధ్యతగా ధరించాలన్నారు. వాహనదారులు సెల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. హెల్మెట్ ధారణ వలన ఏదైనా ప్రమాదం జరిగితే తలకు గాయం కాదని మిగిలిన శరీర భాగాలకు గాయాలతై త్వరితగతిన కోలుకోవచ్చన్నారు. మైనర్ బాల బాలికలకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో భీమవరం, పాలకోడేరు ఎస్సైలు ఐ.వీర్రాజు, రవివర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరులో ఆదివారం భీమవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్నప్పుడు ప్రమాదాలు జరిగినప్పుడు తలకి గాయాలు కావడం వల్ల అధిక శాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు.

విద్యార్థులకు అవార్డులు

వీరవాసరం: దేశ, రాష్ట్ర ప్రగతికి సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిటైర్డ్ కమర్షియల్ రైల్వే మేనేజర్ కాయల వెంకట్రావు అన్నారు. నేలపోగుల గ్రామంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదర్శ రైతు, ఉత్తమ విద్యార్థులకు అవార్డులను ప్రకటించి ఆదివారం అందజేశారు.